RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 186 | ఆగస్టు 06 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 186 | August 06 Thursday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి: మూసారాంబాగ్ ప్రాజెక్టును తనిఖీ చేసిన మంత్రులు పొన్నం, అజారుద్దీన్ 2

## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై

# కేంద్రం జోక్యం చేసుకోవాలి

### కేంద్రమంత్రి సి.ఆర్. పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 150 మీటర్లకు పెంచే విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఒప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు ఎంపీలతో కలిసి సీఎం పాల్గొని వినతిపత్రం సమర్పించారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిన విషయాన్ని గుర్తుచేసిన సీఎం, ఎత్తును 150 మీటర్లకు పెంచినా ముంపు ప్రాంతం 1,000 హెక్టార్లలోపే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రాజెక్టు ఎత్తు పెంపుతో ఎత్తిపోతల (లిఫ్ట్) భారం లేకుండా గ్రావిటీ ద్వారానే సజావుగా నీటిని అందించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, దేవులపల్లి (ఎస్ఆర్వీఆర్ డిండి), గౌరవెల్లి ప్రాజెక్టులతో పాటు పలు రహదారులకు సంబంధించిన శాఖాపరమైన అటవీ పర్యావరణ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన సీఎం



రేవంత్ రెడ్డి, ప్రధాని

➢ మిగతా 2వ పేజిలో..

## హర్మూజ్ జలసంధి తెరిచే

# వరకు దాడి ముప్పు

### ఇరాన్‌కు డోనాల్డ్ ట్రంప్ ఘాటు హెచ్చరిక



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. దౌత్యపరమైన చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని భావిస్తున్న సమయంలో, వాటిని ఇరాన్ బహిరంగంగా ఖండించడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈసారి గనుక చర్చల నుంచి వెనక్కి తగ్గితే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కనివినీ ఎరుగని రీతిలో అతిపెద్ద దాడిని ఎదుర్కోవాల్సి ఉంటుందని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఇరాన్ వైఖరిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై రాబోయే 48 గంటల్లో స్పష్టత వస్తుందని, ఆ దేశం అణ్వాయుధాలు

➢ మిగతా 2వ పేజిలో..

# దిగొచ్చిన మెటా

### ప్రధాని మోదీ వీడియో తొలగింపు వ్యవహారంలో మార్క్ జుకర్‌బర్గ్ బహిరంగ క్షమాపణలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన ఒక వీడియోను తాత్కాలికంగా తొలగించడం మరియు నియంత్రించడంపై రేగిన దుమారంతో సోషల్ మీడియా దిగ్గజం మెటా దిగివచ్చింది. ఈ ఘటనపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు తెలిపారు. తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో పొరపాట్లు జరిగాయని అంగీకరించడమే కాకుండా, డీప్‌ఫేక్స్, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి డబ్బులు తీసుకున్నామనే విషయాన్ని కూడా మెటా ఒప్పుకుంది. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై జులై 23న ప్రధాని మోదీ మాట్లాడిన వీడియోను ఫేస్‌బుక్ పరిమితం చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడంతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారంలో



పార్లమెంటరీ కమిటీ మెటాకు మూడు రోజుల అల్టిమేటం జారీ చేస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను రద్దు చేసే అంశాన్ని

➢ మిగతా 2వ పేజిలో..

# విశాఖలో 'ఐబీఎం ఫ్యూచర్‌నౌ'

### గ్లోబల్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావా లని మంత్రి లోకేశ్ పిలుపు

**విశాఖపట్నం జనసంఘర్షణ**

ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ యువత చురుగ్గా భాగస్వామ్యం కావాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ ఐటీ దిగ్గజం ఐబీఎం ఏర్పాటు చేసిన నూతన 'ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్'ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ సేవలు, సాంకేతిక ఆవిష్కరణలకు విశాఖపట్నాన్ని అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేవలం సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, నాణ్యమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రతిభావంతులైన మానవ వనరులను తీర్చిదిద్దడం మరియు ఏపీ యువత గ్లోబల్ డిజిటల్ ఎకానమీలో భాగమయ్యేలా సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. గ్లోబల్ క్లయింట్లకు అధునాతన





ఏఐ, కన్సల్టింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా ఐబీఎం ఈ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను తీర్చిదిద్దింది. ఈ కేంద్రం ద్వారా ఆర్టిఫిషియల్

➢ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణలో అందుబాటులోకి 'డయల్ 112'

### పోలీసు, ఫైర్, అంబులెన్స్ సేవలు ఇక ఒక్కటే నంబర్‌పై!

**హైదరాబాద్ జనసంఘర్షణ**

అత్యవసర సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ తెలంగాణ ప్రభుత్వం 'డయల్ 112' సేవలను అధికారికంగా ప్రారంభించింది. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు, ఫైర్, అంబులెన్స్‌తో పాటు న్యాయ, వైద్య, సైబర్ సాయం వంటి 18 రకాల విభిన్న సేవలను ఈ ఒక్క నంబర్ ద్వారానే పొందవచ్చుని

➢ మిగతా 2వ పేజిలో..





## తమిళనాట టీవీకే


# ప్రభుత్వం తొలి బడ్జెట్

### విద్య, మహిళా సంక్షేమానికి పెద్దపీట

**చెన్నై జనసంఘర్షణ**

తమిళనాడు రాష్ట్రంలో సీఎంగా విజయ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన ప్రభుత్వం అసెంబ్లీలో బుధవారం తన తొలి బడ్జెట్‌ను సమర్పించింది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో

➢ మిగతా 2వ పేజిలో..



## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

**మొదటిపేజీ తరువాయి..** మోదీని ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో తమ ప్రభుత్వం స్పందించి చట్టపరంగా కేసులు నమోదు చేసిందని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇటువంటి ఘటనలపై కనీసం ఒక్క కేసైనా నమోదు చేశారా అని ప్రశ్నించారు. ఒక డీఎస్పీ బదిలీ అంశంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలకు స్పందిస్తూ, అధికారుల బదిలీ అనేది ప్రభుత్వ ముందస్తు పరిధిలోని అధికారమని స్పష్టం చేశారు.

# తెలంగాణలో అందుబాటులోకి 'డయల్ 112'

**మొదటిపేజీ తరువాయి..** వెల్లడించారు. బాధితులు డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు ఏ నిమిషంలోనూ ఆ కాల్‌ను పోలీసులు తిరస్కరించడానికి వీల్లేదని, బాధితుల లొకేషన్‌ను తక్షణమే గుర్తించేందుకు అడ్వాన్స్ అలర్టింగ్ సిస్టమ్‌ను ఉపయోగిస్తున్నామని స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు అంతస్తులను ప్రత్యేకంగా ఈ వ్యవస్థ పర్యవేక్షణ కోసం కేటాయించినట్లు తెలిపారు. సాంకేతికతను జోడించి ఈ సేవలను మరింత బలోపేతం చేసేందుకు డయల్ 112ను వర్షన్ 3.0గా రూపొందించామని డీజీపీ పేర్కొన్నారు. అత్యవసర స్పందన వ్యవస్థను మరింత వేగవంతం చేసేందుకు త్వరలోనే ప్రత్యేక డ్రోన్ ఆధారిత టీమ్‌ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఈ కొత్త విధానంలో కృత్రిమ మేధ సాంకేతికతను, యంగ్ ఐపీఎస్ అధికారుల నైపుణ్యాలను భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గతంలో సూచించిన "ఒకే అత్యవసర నంబర్" నిబంధనకు అనుగుణంగా, 2013లో ప్రారంభమైన డయల్ 100 స్థానంలో టెక్నాలజీ పోలీసింగ్‌ను మరింత ఆధునీకరించి ఈ డయల్ 112ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి: మూసారాంబాగ్ ప్రాజెక్టును తనిఖీ చేసిన మంత్రులు పొన్నం, అజారుద్దీన్

**హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయినట్లు హైదరాబాద్ ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి అజారుద్దీన్‌తో కలిసి ఆయన నూతనంగా నిర్మించిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల వ్యయంతో అందుబాటులోకి తెచ్చిన ఈ అత్యాధునిక స్టీల్ బ్రిడ్జి ద్వారా చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఒవైసీ ఆస్పత్రి వైపునకు, అలాగే చంపాపేట మార్గానికి రాకపోకలు మరింత సులువవుతాయని పేర్కొన్నారు. అతిత్వరలోనే ఈ వంతెనను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల నివాసితులకు దీర్ఘకాలిక ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి లభించడమే కాకుండా ప్రయాణ సమయం ఆదా కానుంది. ఇదే సమయంలో మూసారాంబాగ్ వద్ద చేపట్టిన వంతెన నిర్మాణం కూడా చివరి దశకు చేరుకుందని, రాకపోకలను సులభతరం చేసేందుకు అప్రోచ్ రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన ప్రాజెక్టులతో పాటు పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రజలకు వేగవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## ఎపిఎన్ఆర్టీ కోఆర్డినేటర్ల నియామకం

**అమరావతి :** ఏపీ ఎన్ఆర్టీ కోఆర్డినేటర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండో విడత జాబితాలో నియమించింది. రెండో విడతలో 292 మందిని కోఆర్డినేటర్లుగా నియమించింది. ప్రవాసాంధ్రుల అభ్యున్నతికి సంక్షేమం కోసం ఈ నియామకాలు చేపట్టినట్లు ఏపీ ఎన్ఆర్టీ ప్రకటించింది. భారత ఎంబసీలు, స్థానిక ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛంద సేవలు అందించేందుకు కోఆర్డినేటర్లు సహకరిస్తారని తెలిపింది. కొత్తగా కోఆర్డినేటర్లుగా నియమితులైన వారికి ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ ప్రెసిడెంట్ వేమూరి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

# హర్మూజ్ జలసంధి తెరిచే వరకు దాడి ముప్పు

**మొదటిపేజీ తరువాయి..** కలిగి ఉండటాన్ని అమెరికా ఎంతమాత్రం సహించదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకల పునరుద్ధరణకు సంబంధించి ఇరాన్ మరియు ఒమన్‌లతో తాము చర్చలు జరుపుతున్నామని, ఒకటి రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వెల్లడించారు. అయితే అమెరికా ప్రకటనను ఇరాన్ తక్షణమే తిరస్కరించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న సంప్రదింపుల్లో అమెరికా ప్రమేయం ఏమాత్రం లేదని, కేవలం తమ సార్వభౌమాధికారం మరియు భద్రతా ప్రయోజనాల పరిరక్షణ కోసమే కొత్త సముద్ర రవాణా విధానంపై చర్చిస్తున్నామని తెలిపింది. ఇరు దేశాల మధ్య పరస్పర ప్రతికూల వ్యాఖ్యలతో పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

# తమిళనాట టీవీకే ప్రభుత్వం తొలి బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి..** విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు విశేష ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యంగా ఎన్నికల హామీల్లో ప్రధానమైన 'అన్నన్ సీర్ తిట్టమ్' పథకానికి బడ్జెట్‌లో రూ.812 కోట్లు కేటాయించడం విశేషం. ఈ పథకం ద్వారా లబ్ధిదారులైన వధువులకు 8 గ్రాముల బంగారం మరియు పట్టుచీరను అందించనున్నారు. ఉపాధి, సాంకేతిక రంగాలకు సైతం పెద్దపీట వేస్తూ, 2031 నాటికి సుమారు ఐదు లక్షల మంది ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులు మరియు అధ్యాపకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అంతేకాకుండా, 'వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్' ద్వారా లక్షమంది యువతకు దశలవారీగా నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందుబాటులోకి తేనున్నారు.

విద్యా రంగానికి సంబంధించి కీలక ప్రకటనలు చేస్తూ, రూ.2వేల కోట్ల అంచనాతో విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసేందుకు 'వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్'ను ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించేందుకు రూ.300 కోట్లు కేటాయించగా, 'పుతియ పయనం-పుతియ వేగం' కింద 11వ తరగతి చదువుతున్న 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లతో పాటు హెల్మెట్లు, వాటర్ బాటిళ్లను కూడా అందజేయనున్నారు. కాగా, కుటుంబ పెద్దగా ఉన్న మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, ఏటా 6 ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, మరియు మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి ఇతర హామీలకు సంబంధించి ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటనలు వెలువడలేదు.

## విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

**బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం**

**బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. 2024-25 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో విద్యారంగానికి కేవలం 5.98 శాతం మాత్రమే కేటాయించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. గత 6-7

ఏళ్ల తెలంగాణ బడ్జెట్‌లను పరిశీలిస్తే విద్యారంగానికి ఇంత తక్కువ శాతం నిధులు కేటాయించడం ఇదే తొలిసారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజ్ఞాన గనిగా మారాల్సిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే ఉంచుకున్నప్పటికీ, ఆ శాఖకు తగిన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తారని భావిస్తే, బడ్జెట్‌లో కేవలం 5.98 శాతానికే పరిమితం చేయడం దురదృష్టకరమని అన్నారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యాలయాలు మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ సమాజం విద్యావంతం కావడం, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే విద్యారంగానికి కేటాయింపు లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# దిగొచ్చిన మెటా

**మొదటిపేజీ తరువాయి** పరిశీలిస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌లతో న్యూఢిల్లీలో సుదీర్ఘంగా సమావేశమైంది. ప్రముఖుల ఖాతాల్లోని పోస్టుల తొలగింపు, అల్గోరిథం పనితీరు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తప్పుడు సమాచార నియంత్రణ మరియు భారత చట్టాలకు లోబడి పనిచేయడంపై కేంద్రం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దేశ భద్రత, ప్రజా శాంతి విషయాల్లో సోషల్ మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందేనని కేంద్రం తేల్చిచెప్పింది.

## విశాఖలో 'ఐబీఎం ఫ్యూచర్‌నౌ'

**మొదటిపేజీ తరువాయి..** ఇంటెలిజెన్స్, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాలలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. అంతేకాకుండా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫామ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్ మరియు క్వాలిటీ ఇంజనీరింగ్ సేవలకు ఇది ప్రధాన హబ్‌గా వ్యవహరించనుంది. విశాఖను దేశంలోనే ప్రముఖ ఏఐ మరియు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రంగా మార్చే క్రమంలో ఐబీఎంతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి లోకేశ్ తెలిపారు.

## క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలో వర్షాలు: 18 జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

**హైదరాబాద్**

రాష్ట్రంలో ఏర్పడిన క్యుములోనింబస్ మేఘాల ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో వర్ష సూచన ఉందని పేర్కొంటూ వివిధ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అలెవిధంగా హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, నారాయణపేట, వరంగల్ సహా 18 జిల్లాలకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

గడిచిన 24 గంటల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గణనీయమైన వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా పిట్లంలో 14.11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం మీద 4 మండలాల్లో 11.56 సెం.మీ నుంచి 20.44 సెం.మీ మధ్య అత్యంత భారీ వర్షపాతం నమోదు కాగా, 40 మండలాల్లో 6.45 సెం.మీ నుంచి 11.55 సెం.మీ మధ్య మోస్తరు వర్షపాతం, అలాగే 281 మండలాల్లో 1.56 సెం.మీ నుంచి 6.44 సెం.మీ వరకు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## ఎపికి విదేశీ పెట్టుబడుల వెల్లువ

**లోక్‌సభలో వైసిపి సభ్యుడి ప్రశ్నకు కేంద్రం సమాధానం**

**న్యూఢిల్లీ** ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024-25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది. 2025 – 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025 – 26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్‌అండ్‌డీ పరిధిలోనూ 2025-26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పెట్టుబడులు ఊపందుకున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రీసౌండింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొంది. లోహ, ఆహార శుద్ధి, సిమెంట్ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని కేంద్రం ప్రభుత్వం స్పష్టం

## ప్రజల భద్రతే లక్ష్యం - ప్రతి ఒక్కరూ '112' ఎమర్జెన్సీ నంబర్‌ను మొబైల్‌లో సేవ్ చేసుకోండి

హైదరాబాద్,/ ఆగస్టు 5: /(జన సంఘర్షణ)

రాష్ట్ర ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు అమలులో ఉన్న డయల్ 100 స్థానంలో '112' అనే ఒకే ఒక్క సమగ్ర ఎమర్జెన్సీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఇకపై పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక శాఖ సహా అన్ని అత్యవసర సేవల కోసం ప్రజలు 112 నంబర్‌కే కాల్ చేయాలని డీజీపీ సూచించారు. ప్రతి కుటుంబం ఈ నంబర్‌ను తమ మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా సేవ్ చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో కాల్స్ ఆలస్యం కాకుండా ఉండేందుకు ఒకేసారి 960 కాల్స్‌ను స్వీకరించేలా వ్యవస్థను ఆధునీకరించినట్లు అధికారులు తెలిపారు.






**ప్రజలకు సూచన:..**

ప్రమాదం, అగ్నిప్రమాదం, వైద్య అత్యవసర పరిస్థితులు లేదా ఇతర అత్యవసర సమయాల్లో సమయం వృథా చేయకుండా వెంటనే 112కు కాల్ చేయండి. ఈ నంబర్‌ను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులకు కూడా తెలియజేసి అందరూ తమ మొబైల్‌లలో సేవ్ చేసుకునేలా అవగాహన కల్పించండి. ప్రజల అప్రమత్తతే ప్రాణాలను కాపాడగలదని అధికారులు పేర్కొన్నారు.

## అమాయకులపై అక్రమంగా రౌడీ షీట్లు నమోదు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

- న్యాయవాదుల హెచ్చరిక
- రౌడీ షీట్ ఓపెన్ చేస్తే చెల్లదు
- రౌడీ షీట్‌కు చట్టబద్ధత లేదు
- సుప్రీం కోర్ట్, హై కోర్టుల సంచలన తీర్పులు ...

హైదరాబాద్/ఆగస్టు 5/(జన సంఘర్షణ)

సమాజంలో మనం చాలా సందర్భాల్లో ముఖ్యంగా పోలీస్ వ్యవస్థలో, కోర్టుల్లో, పలు కేసుల్లో, రాజకీయంగా రౌడీ షీట్ అనే పదం వింటూనే ఉంటాం. రౌడీ షీట్ అనగానే చాలా మందికి సాధారణ ప్రజలకి ఒకరకమైన భయం, అభద్రత భావం. రౌడీ షీటర్ అనీ ఒక వ్యక్తికి ముద్రపడగానే కొంత వరకు సమాజం ఆ వ్యక్తీ పట్ల చిన్నా కూడా చూపు చూపిస్తుంది. కొందరు సాధారణ పౌర జీవనం నుండి గతీ తప్పిన యువకులు చెడు వ్యసనాలకు పాల్పడి నేరాలు చేసి కేసులు నమోదు కావటం వలన పలు పోలీస్ స్టేషన్లో రౌడీలుగా నమోదు అవుతున్నారు. కొందరు సినీమాలూ, సీరియళ్లు, సాంఘిక, కుటుంబ నేపథ్యంలో రౌడీ లుగా నమోదు అయితే మరీ కొందరు స్థానిక పరిస్థితుల ఆధారంగా రాజకీయ క్రీడలో కక్ష్య పూరితంగా రౌడీలుగ బలవంతంగా నమోదు అవుతున్నారు. నేటి కాలంలో అయితే రాజకీయనాయకులే కొందరు పోలీస్ అధికారుల సహాయంతో కక్ష్య పూరితంగా రౌడీ షీటర్ లను ఉత్పత్తి చేస్తున్నారు ముద్రవేస్తున్నారు. స్థానికంగా ఎదుటి వ్యక్తి అంటే గిట్టనివారు ఇతర ప్రత్యర్థుల మీదా పోలీస్ స్టేషన్లో పలు కేసులు నమోదు చేయించి ఎదుటి వ్యక్తికి వినాశనాన్ని కోరుకుంటున్నారు. ఇది ఒక రకమైన విద్వేషంగా చెప్పవచ్చు.

**1. రౌడీ షీట్ అంటే ఏమిటి...?**

ఒక వ్యక్తి పదే పదే ఫ్రుఎల్ఙఖ్రీ గా అలవాటుగా నేరాలకు పాల్పడితే అతని పై పోలీసులు రౌడీ షీట్ నూ నమోదు చేయటాన్ని రౌడీ షీట్ అంటారు. స్టేషన్ హౌజ్ ఆఫీసర్ అభ్యర్థన మేరకు సిపి, ఎసిపి , డిఎస్పీ, లాంటి ఉన్నాత పోలీసు అధికారులు రెండూ లేదా మూడు కంటే ఎక్కువ కేసులూ నమోదు కాబడిన వ్యక్తుల మీద రౌడీ షీట్లు ఓపెన్ చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నా చిన్నా నేరాలకు కాకుండా పబ్లిక్ ఆర్డర్ కూ భంగం కలిగిన సందర్భాల్లో జడ్జీ అనుమతితో ఓపెన్ చేయాలీ అది కూడా హిస్టరీ షీట్ మాత్రమే రౌడీ షీట్ ఎంత మాత్రం కాదు.

**2. రౌడీ షీట్ ఎవరీపై ఓపెన్ చెస్తున్నారు.**

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 2500 పైగా రౌడి షీట్స్ ఓపెన్ చేశారని గణాంకాలు చెప్తున్నాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పి ఎస్ ఓ లు పోలీస్ పరిపాలన మార్గదర్శకాలు తెలంగాణలో కూడా దత్తతకు తీసుకున్నాము. వాటి ఆధారంగానే రౌడీ షీట్ లు నమోదు చేస్తున్నారు. రౌడి షీట్లు ముఖ్యంగా భూ మాఫియా చేసే వారిపై , సెటిల్మెంట్‌లు చేసేవారిపై, హత్య కేసులు ఉన్నవారిపై, ఇవ్ టీజర్స్‌పై, దోపిడీలు చేసే వారిపై రౌడి షీట్లు నమోదు చేస్తున్నారు పోలీస్ లు. భూ సమస్యలు ఉన్నవారిపై , చిన్న చిన్న నేరాలకు పాల్పడిన వారి పై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని పోలీస్ స్థానిక రాజకీయాలకు తలొగ్గి సామాన్యుల మీద రౌడి షీట్లు నమోదు చేసినా సంఘటనలు కోకొల్లలు. ఇంటి పక్కవాల్లతో విభేదాలు, ద్వేషం, అసూయ, రాజకీయ కక్ష్యలు లాంటి కారణాల చేత కూడా రౌడి షీట్లు నమోదు చేస్తున్నారు పోలస్ అధికారుల. రాజకీయ జోక్యం తోనే రౌడి షీట్లు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. రౌడి షీట్ కు ఎఫ్ ఐ ఆర్ ఉండదు, కేసు ఉండదు.

**3. రౌడీ షీటర్ అనీ మీపై పోలీస్‌లు ముద్ర వేయ్యొచా.?**

మీ పై పోలీస్ స్టేషనులో పలు కేసులూ నమోదు అయినప్పటికీ మీ పై చట్టము ప్రకారం రౌడీ షీట్ ఓపెన్ చేయటం కానీ, ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జస్టిస్ ఇవీఎస్ సోమయాజులు సంచలనమైన తీర్పునూ వెలువరించారు. ఆ తీర్పు ప్రకారం మీ వ్యక్తిగత వివరాలను, చిరునామాలను పలు పోలీస్ స్టేషన్లో ప్రదర్శించటం చెయ్యరాదు. అలాగే మీ తలపై ముసుగు వేసి , లేదా బహిరంగంగా ప్రెస్ మీట్ పెట్టీ మీరూ రౌడీ లు అనీ చెప్పటానికి కూడా వీలు లేదునీ మీ ఫొటోస్ , వేలి ముద్రలు కూడా తీసుకోవటానికి పోలీస్ లకు లేదని . మీ వ్యక్తిగత గోప్యతా హక్కులను బంగపరచటానికి పోలీస్ లకు అధికారం లేదు అని ఏపీ హై కోర్ట్ స్పష్టం చేసింది. సుప్రీం కోర్ట్ కే ఎస్ పుట్టు స్వామి కేసులో ఇచ్చిన తీర్పును ఉల్లంఘించరాదని పేర్కొంది. కాబట్టి మిమ్మలని రౌడీ లు అనీ చెప్పటానికి పోలీసులకు ఎంత మాత్రం అధికారం లేదు.

**4. మీ పై రౌడీ షీట్ ఓపెన్ చేస్తే పోలీస్‌లపై క్రిమినల్ అండ్ సివిల్ కేసులు వేయొచ్చు.**

పోలీస్‌లు చట్టబద్ధత లేని రౌడీ షీట్ మీ పై ఓపెన్ చేస్తే సదర్ పోలీస్ అధికారి పై మీరూ క్రిమినల్ కేసులు మరియూ సివిల్ కేసులు పరువు నష్టం దావా కేసులు వేయొచ్చు. అలాగే కోర్టు దిక్కరణ కేసులు కూడా నమోదు చెయ్యొచ్చు. సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు కె యస్ పుట్టు స్వామీ కేసులో, ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ ఈవీఎస్ సోమయాజులు ఇచ్చిన తీర్పులో పేర్కొన్న అంశాలను బేస్ చేసుకోవచ్చు. స్వయంగా హైకోర్ట్ రౌడీ షీట్ ఓపెన్ చేస్తే కోర్ట్ దిక్కరణ కేసులు నమోదు చేయాలని పేర్కొనటం గమనార్హం.

**5. మీపై రౌడీ షీట్‌ను ఎలా ఎదుర్కోవాలి.**

చాలా మంది రౌడీ షీట్ నమోదు అయిన వ్యక్తులూ, సామాన్యులు రౌడీ ఓపెన్ కాగానే ఇక వారి జీవితం ముగిసిందని జీవితం ప్రమాదంలో పడింది అనీ ఆత్మ నున్యత భావంలో వెళ్తున్నారు. ఈ సమస్య నుండి ఎలా బయటపడాలో చాలా మందికి తెలియదు.తీ ఒక రౌడీ షీట్ క్లోజ్ చేయాలంటే ఒకటీ పోలీస్ అధికారులు చేస్తారు రెండోది కోర్టు చేస్తుంది. పోలీస్ అధికారుల దృష్టిలో సదర్ రౌడీ షీట్ నమోదు కాబడిన వ్యక్తి ప్రవర్తనలో మార్పు వచ్చిందని భావించి అతనీ పై ఎలాంటి క్రిమినల్ కేసులో లేకుంటే జిల్లా స్థాయి పోలీస్ ఉన్నత అధికారి ఎస్ ఎచ్ ఓ సూచన మేరకు తొలగించవచ్చు కానీ ఎలాంటి కేసులు లేకున్నా , కేసులు కోర్టులలో కొట్టుడు పోయిన రౌడీ షీట్ నూ పోలీస్‌లు కొనసాగిస్తున్నారు. రెండోది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హై కోర్టులో మీ పై నమోదు అయిన రౌడీ షీట్ ను సవాల్ చేస్తూ వాజ్యం వేయొచ్చు. రౌడీ షీట్లకు చట్ట బద్ధత లేదు కాబట్టి కచ్చితంగా కొట్టివేయబడుతుంది.



**జస్టిస్ ఇవీఎస్ సోమయాజులు ఇచ్చిన తీర్పులో ముఖ్యమైన అంశాలు....**

1. పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్ కేవలం పరిపాలన మార్గదర్శకాలు మాత్రమే అనీ స్పష్టం చేసింది
2.రౌడీ షీట్ నమోదు, కొనసాగింపు తరుచ ఠానాల్లోకి పిలవటం, వేలి ముద్రల, ఫోటోల సేకరణ, ప్రదర్శన, వ్యక్తుల గోప్యతా హక్కులను ఉల్లంగించటమేనని స్పష్టం చేసింది
3.పోలీస్ మార్గ దర్శకాల ఆధారంగా రౌడీ షీట్ నమోదు చేస్తే కోర్ట్ దిక్కరన కేసు నమోదు చేయాలని స్పష్టం చేసింది.
4. చట్టం అనుమతి లేకుండ రౌడీ షీట్ నమోదు, కొనసాగింపు,వ్యక్తిగత సమాచారం సేకరించవద్దని పోలీస్ లకు తేల్చి చెప్పింది.
5. పోలీస్ మార్గదర్శకాల పేరు చెప్పి నిందితుల, అనుమానితుల ఇండ్లకు రాత్రిళ్ళు వెళ్ళ వద్దని చెప్పింది.
6. వారాంతపు సెలవుల్లో నిందితుల,అనుమానితులను పోలీస్ స్టేషన్లకు పిలువ వద్దని, ఠానాల్లో వారిని వేచి ఉండేలా చెయ్యొద్దని పేర్కొంది.
7. స్టేషన్ దాటి వెళ్ళాలంటే అనుమతి తీసుకోవాలనే షరతులు పెట్టొద్దని పోలీస్ లకు స్పష్టం చేసింది.
8. సుప్రీం కోర్ట్, హై కోర్ట్ గతంలో ఇచ్చిన తీర్పులను ఉల్లంఘిస్తూ రౌడీ షీట్ లు నమోదు చేస్తున్నారని పేర్కొంది.
9. తగిన కారణాలు, విశ్వసనీయ సమాచారం లేకుండా లేకుండ చాలా మంది పై రౌడీషీటర్ లుగా ముద్రా వేస్తున్నారని అంది.
10. 1960లో ఎపి పి ఎస్ వో ప్రవేశ పెట్టినపుడు అవీ మార్గదర్శకాలేనని ఆ జిఓ లనే స్పష్టంగా పేర్కొన్నారు అనీ తెలిపింది.
11. ఏపీపిఎస్ ఓ కు చట్ట బద్ధత లెని ఏపీ పిఎస్ఓ ఆధారంగా రౌడీ షీట్ నమోదు, నిఘా పెట్టడం, ఫొటోల ప్రదర్శన చేయటం కే ఎస్ పుట్టు స్వామీ కేసులో సుప్రీం కోర్టులో ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఉల్లంఘించడమే.

## మండల స్థాయిలోనూ 'ప్రజావాణి'.. సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

హైదరాబాద్,/ ఆగస్టు 5/(జన సంఘర్షణ)

గ్రామీణ ప్రాంతంలో ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే వేగంగా పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇకపై రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో కూడా 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతిపత్రాలను నేరుగా అధికారులకు అందజేయవచ్చు. ఇప్పటివరకు జిల్లా కేంద్రాల్లో మాత్రమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, తాజా నిర్ణయంతో ప్రతి మండల అభివృద్ధి కార్యాలయంలోనూ ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనివల్ల ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ మండలంలోనే సమస్యలకు పరిష్కారం పొందే అవకాశం కలుగుతుంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు, ఫిర్యాదుల పరిష్కారం వేగవంతమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రజాపాలనను గ్రామీణ స్థాయికి మరింత చేరువ చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటోంది.




## బస్సు ఎక్కబోతుంటే కాలితో తన్నిన కండక్టర్..

బెంగళూరు/ఆగస్టు 5:/(జన సంఘర్షణ)



కర్ణాటక రాజధాని బెంగళూరులో మానవత్వాన్ని ప్రశ్నించే ఘటన చోటుచేసుకుంది. బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని కండక్టర్ కాలితో తన్ని కిందికి తోసేయడంతో అతడు రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. వీడియో వైరల్ కావడంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కండక్టర్ కృష్ణమూర్తిని సస్పెండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కండక్టర్ వివరణతో పాటు వీడియో దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి నిబంధనల ప్రకారం కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి మరోసారి సూచించినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, బాధితుడు భిక్షాటన చేసి జీవనం సాగించే వ్యక్తి అని తెలుస్తోంది. అతడిని బస్సు నుంచి కాలితో తోసివేసి అక్కడే వదిలేసి వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రయాణికుల భద్రతకు బాధ్యత వహించాల్సిన సిబ్బంది ఇలా అమానుషంగా ప్రవర్తించడం సరికాదని", "పేదవారిపట్ల ఇలాంటి ప్రవర్తన ఏమాత్రం సమర్థనీయం కాదని", "బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని" నెటిజన్లు, సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఘటన ప్రజా రవాణా వ్యవస్థలో సిబ్బంది ప్రవర్తనపై మరోసారి చర్చకు దారితీసింది.

## శిథిలవస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించిన సర్పంచ్ భవాని సాయిలు

- పలు సూచనలు చేసిన సర్పంచ్

కామారెడ్డి జిల్లా : ఆగస్టు 05 సదాశివనగర్ మండల్ (జన సంఘర్షణ) ప్రతినిధి



సదాశివనగర్ మండల్ తిమ్మాజివాడిలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలవస్థలో ఉన్న ఇండ్లను సర్పంచ్ భవాని సాయిలు ఉప సర్పంచ్ జే రవీందర్ వార్డు సభ్యులు కలిసి పరిశీలించారు కార్యక్రమం అనంతరం శిథిలవస్థలో ఉన్న ఇళ్లల్లో నివసిస్తున్న ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని ప్రతి రోజు మంచినీటిని వేడి చేసి చల్లార్చిన నీరును త్రాగాలని ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీలేఖ యాఫ్ ఏ నర్సింలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గొర్రెపోతు-దూడ స్నేహం.. వైరల్ పిక్

నిజామాబాద్,) ఆగస్టు 5/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లాలో హృదయాలను హత్తుకునే ఓ మధురమైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంటోంది. గోవింద్‌పేటలో బుధవారం ఉదయం గొర్రెపోతు, ఆవు దూడ కలిసి సరదాగా ఆడుకుంటూ కనిపించాయి. ఒకదానికొకటి ప్రేమగా ఢీకొంటూ, పరుగులు తీస్తూ స్నేహబంధాన్ని చాటిన తీరు అక్కడి స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. జంతువుల మధ్య కూడా సహజమైన ప్రేమ, అనుబంధం ఎంత గొప్పదో ఈ దృశ్యం మరోసారి నిరూపించింది. ఈ అపురూప క్షణాలను చూసిన స్థానికులు తమ మొబైల్ ఫోన్లలో వీడియోలు, ఫొటోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. ఈ దృశ్యాన్ని చూసిన నెటిజన్లు, స్థానికులు "మూగజీవాల ప్రేమ మనుషులకు ఆదర్శం", "స్నేహానికి జాతి, జీవి అనే తేడా ఉండదు", "ఇలాంటి దృశ్యాలు మనసుకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి", "ప్రేమ, అనురాగమే ప్రపంచాన్ని అందంగా ఉంచుతాయి" అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అపూర్వ స్నేహబంధం అందరి ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తూ సోషల్ మీడియాలో విశేష ఆదరణ పొందుతోంది.

## కుమార్తె వివాహానికి మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు దంపతులు

హైదరాబాద్ / ఆగస్టు 5/(జన సంఘర్షణ)



జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, ఆయన సతీమణి తోట అర్చన తో కలిసి తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కుమార్తె వివాహ మహోత్సవానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. ఎమ్మెల్యే దంపతులను మంత్రి శ్రీధర్ బాబు ఆత్మీయంగా పలకరించి, ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించారు. అనంతరం వధూవరులకు ముందస్తుగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగగా, ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న పరస్పర అనుబంధం, మర్యాదా సంప్రదాయాలకు ఇది నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు దంపతుల ఈ మర్యాదపూర్వక ఆహ్వానం రాజకీయ, సామాజిక వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## తెలంగాణలో డయల్ 112 ప్రారంభం

- అందుబాటులోకి పోలీస్ సహా 18 రకాల సేవలు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)




తెలంగాణలో డయల్ 112 సేవలను బిజెపి సి.వి ఆనంద్ హైదరాబాదులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రారంభించడం జరిగింది. 112 ద్వారా పోలీస్, అగ్నిమాపక, వైద్యం సహా మొత్తం 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బాధితుల నుంచి ఈ నెంబర్కు ఫోన్ రాగానే కాలర్ ఖచ్చితమైన లొకేషన్ ఆటోమేటిక్ గా తెలిసిపోతుందని, వెంటనే పోలీస్, ఫైర్, మెడికల్ రెస్పాన్స్ టీమ్లు అప్రమత్తమై నిమిషాల వ్యవధిలో సహాయం చేస్తాయని అధికారులు తెలిపారు.

# గ్రామ సొసైటీ సబ్ సెంటర్ ప్రారంభం..

❑ చిట్యాల రైతులకు తప్పిన ఎరువుల కష్టాలు

తాడ్వాయి/ఆగస్టు 5/(జన సంఘర్షణ)

తాడ్వాయి మండలం చిట్యాల గ్రామ రైతులకు ఎరువుల కొరకు ఇతర గ్రామాలకు వెళ్ళవలసిన ఇబ్బందులు తొలగిపోయాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లే కష్టాలు తప్పించడానికి, అరగొండ సొసైటీ ఆధ్వర్యంలో చిట్యాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎరువుల సబ్ సెంటర్ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలో చిట్యాల రైతులు యూరియా ఇతర ఎరువుల కోసం అరగొండ, తాడ్వాయి గ్రామాలకు కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి వచ్చేది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరగడంతో పాటు సమయం వృథా అయ్యేది. ఈ సమస్య పై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ సహకారంతో, సర్పంచ్ రంజిత్



రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామంలోనే సబ్ సెంటర్ను అందుబాటులోకి తెచ్చారని అన్నారు.ఫోర్జరీ ఈ కేంద్రం ప్రారంభంతో చిట్యాల, సంతాయిపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఎరువుల కొనుగోలు సులభతరమైంది. తొలి విడతగా ఈ కేంద్రానికి 880 యూరియా బస్తాలు చేరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్థాయిలోనే ఎరువులు అందుబాటులోకి రావడంపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం వ్యవసాయ అధికారి నర్సింలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతు సేవల కోసం ఫ్రేమ్ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. రైతులు ఈ యాప్ ద్వారా ఆన్లైన్లో ఎరువులు బుక్ చేసుకోవచ్చని, ఎకరాకు రెండు బస్తాల చొప్పున యూరియా కేటాయించబడుతుందని స్పష్టం చేశారు. త్వరలోనేఈ యాప్ వినియోగం పై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, సర్పంచ్ రంజిత్ రెడ్డి, సొసైటీ సీఈవో సాయిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల తర్వాత అప్రమత్తంగా ఉండాలి..

❑ అంటువ్యాధుల నివారణకు ప్రజల సహకారం అవసరం: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి బ్యూరో/ఆగస్టు 5/ (జన సంఘర్షణ)

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా నీటి కలుషితం, నిల్వ నీరు, చెత్త పేరుకుపోవడం, దోమల వ్యాప్తి వంటి పరిస్థితులు వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉన్నందున వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసిన తర్వాత మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో వేయాలని, కాలువలు, డ్రైనేజీలు మూసుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. నిల్వ నీరు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు.ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహారానికి వీలైనంత వరకు దూరంగా ఉండాలని సూచించారు. సబ్బుతో తరచూ చేతులు కడుక్కోవడం, తడి దుస్తులను వెంటనే మార్చుకోవడం వంటి అలవాట్లు ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జ్వరం, విరేచనాలు, వాంతులు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్యుడిని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అలాగే పాఠశాలలు, కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు,




గృహాలు పరిశుభ్రంగా ఉండేలా అందరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పరిశుభ్రత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించిన కలెక్టర్, ప్రజలు కూడా స్వచ్ఛందంగా వాటిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడితేనే అంటువ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చు. మీ ఆరోగ్యం –మీ కుటుంబ ఆరోగ్యం – మన జిల్లా ఆరోగ్యం. అందరం కలిసి పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన కామారెడ్డి జిల్లాను నిర్మిద్దాం" అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తల్లి పాలు... బిడ్డకి అమ్మ అందించే మొదటి అమృతం!

❑ ప్రతి బిడ్డకి సరైన పోషణ అందించడం, వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకి పునాది...
❑ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన సమావేశం
❑ పత్రికా మిత్రులకు ఐసీడీఎస్ సూపర్వైజర్ కోటగిరి వినమ్ర ఆహ్వానం



పోతంగల్/ ఆగస్టు 5: /(జన సంఘర్షణ)

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా 2026 ఆగస్టు 6 (గురువారం) మధ్యాహ్నం 2:00 గంటలకు పోతంగల్ సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ తెలిపారు. ఈ సమావేశంలో తల్లిపాల ప్రాముఖ్యత, నవజాత శిశువుల ఆరోగ్యం, తల్లి–బిడ్డ సంక్షేమం, పోషకాహారం, శిశు సంరక్షణ వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు నిపుణుల సూచనలు అందించబడతాయి.ఈ నేపథ్యంలో పత్రికా, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా మిత్రులందరూ సమయానికి విచ్చేసి కార్యక్రమాన్ని కవర్ చేసి, ప్రజలకు ఈ విలువైన సమాచారాన్ని చేరవేయడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఐసీడీఎస్ శాఖ తరఫున వినమ్రంగా కోరారు. ఇట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్, కోటగిరి మండలం అధికారి పేర్కొన్నారు.

# టీఎస్ఆర్టీసీలో మెకానిక్‌గా ఎంపికైన బోయి లక్ష్మణ్‌కు అభినందనలు

❑ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగం సాధించి యువతకు ఆదర్శంగా నిలిచిన బోయి లక్ష్మణ్..

పోతంగల్ తిరుమలాపూర్/ఆగస్టు 5:/(జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన నియామక ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీ ఎస్ ఆర్ టి సి)లో మెకానిక్ (డీజిల్) / మెకానిక్ (మోటార్ వెహికల్) పోస్టుకు బోయి లక్ష్మణ్ ఎంపిక కావడం పట్ల గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, యువత హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించిన బోయి లక్ష్మణ్ విజయాన్ని పలువురు అభినందిస్తూ, ఇది గ్రామ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం, అంకితభావంతో సాధించిన ఈ ఉద్యోగం ఆయన భవిష్యత్‌కు బలమైన పునాది అవుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు మాట్లాడుతూ.. "మీ కృషి, పట్టుదల, నమ్మకం ఈ విజయానికి నిదర్శనం. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము" అని శుభాకాంక్షలు తెలిపారు.




# అందరికీ న్యాయం... అందరికీ అవకాశం... సామాజిక న్యాయం..... తెలంగాణ కోసం మహా సంకల్ప సభ

❑ ఆగస్టు 6న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహణ

హైదరాబాద్, /ఆగస్టు 5:/(జన సంఘర్షణ)

సరూర్‌నగర్ సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"లిను ఆగస్టు 6న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సభలో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, తెలంగాణ అభివృద్ధి, వెనుకబడిన వర్గాల సాధికారత వంటి అంశాలపై చర్చ జరగనుంది. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు, యువత, మహిళలు, సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




**అందరికీ న్యాయం....**

అందరికీ అవకాశం..." అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ మహా సంకల్ప సభ సామాజిక సమానత్వం, సమగ్ర తెలంగాణ నిర్మాణానికి దిశానిర్దేశం చేయనున్న వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పోలీస్ నియామకాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వద్దు..

❑ అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్ రెడ్డి
❑ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్ ప్రతినిధి/ఆగస్టు 5/(జనసంఘర్షణ)



హైదరాబాద్: రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదలైన పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ నేపథ్యంలో నియామక ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని రాజకీయ పార్టీలు, ఇతర శక్తులు నియామక ప్రక్రియను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు నివేదించడంతో ముఖ్యమంత్రి డీజీపీ సీవీ ఆనంద్తో పాటు ప్రభుత్వ, పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "పోలీస్ నియామకాల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదు. ప్రతి దశలో పూర్తి పారదర్శకత, కట్టుదిట్టమైన భద్రత ఉండాలి. ఎవరైనా అవకతవకలకు పాల్పడినా, దుష్ప్రచారం చేసినా కఠిన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణా నుంచి పరీక్షల నిర్వహణ వరకు ప్రతి దశలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగం ప్రత్యేక దృష్టి సారించాలని, పరీక్షల ప్రక్రియ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దామరచెరువు తూము మరమ్మత్తుల్లో నిర్లక్ష్యం కొనసాగితే ఇరిగేషన్ కార్యాలయాల ముట్టడి తప్పదు..

❑ ఉన్నతాధికారులకు ఫిర్యాదు, రైతులతో ఉద్యమం
❑ బీఆర్ఎస్ నేత తేల్ల రవికుమార్ ఘాటు హెచ్చరిక

కోటగిరి, ఆగస్టు 5:





కోటగిరి మండల కేంద్రంలోని దామరచెరువు తూము షట్టర్ మరమ్మత్తుల విషయంలో ఇరిగేషన్ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ మండల నాయకుడు తేల్ల రవికుమార్ మండిపడ్డారు. ఆయకట్టు రైతులతో కలిసి దామరచెరువును పరిశీలించిన ఆయన, తూమును వెంటనే పైకి లేపి అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలానికి ముందే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) నిధులతో చేపట్టాల్సిన మరమ్మత్తులను అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రస్తుతం తూము దెబ్బతిని, చెరువు కట్ట కూడా బలహీనంగా మారిందని ఆయన విమర్శించారు. భారీ వర్షాలతో చెరువు పూర్తిస్థాయిలో నిండితే కట్ట తెగిపోయి రైతుల పంటలతో పాటు ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు కట్టకు వెంటనే మొరం వేసి బలోపేతం చేయడంతో పాటు తూముకు శాశ్వత మరమ్మత్తులు చేపట్టి సాగునీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను గాలికొదిలేస్తూ అధికారులు వ్యవహరిస్తే బీఆర్ఎస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు.

**అధికారులకు హెచ్చరిక...**

48 గంటల్లోగా అధికారులు స్పందించి తూము మరమ్మత్తులు ప్రారంభించకపోతే ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ, జిల్లా కలెక్టర్, ఎస్ఈలకు లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తాం. అంతటితో ఆగకుండా రైతులతో కలిసి ఇరిగేషన్ కార్యాలయాల ముట్టడి, ధర్నాలు, ఆందోళనలు చేపట్టి అధికారులను నిలదీస్తాం. రైతుల ప్రయోజనాల కోసం ఎంతదూరమైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం" అని తేల్ల రవికుమార్ ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మోరే కిషన్, నజీర్, వడ్ల ఉమాకాంత్‌తో పాటు ఆయకట్టు రైతులు వడ్ల శ్యాంసుందర్, గంగాధర్, భీమ్రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# నేడు గద్దర్ వర్ధంతి సభ

◆ గద్దర్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు మెదక్ టీఎన్జీవో భవన్లో వర్ధంతి సభ పోస్టర్ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)




నేడు హైదరాబాద్‌లో జరిగే ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని గద్దర్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు మెదక్ టీఎన్జీవో భవన్ లో వర్ధంతి సభ పోస్టర్ ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గద్దర్ ఫౌండేషన్ సభ్యులు బొమ్మల మైసయ్య. జెల్ల సుధాకర్. కాంగ్రెస్ నాయకులు గంగాధర్. సీనియర్ జర్నలిస్టు బొందుగుల నాగరాజు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ శంకర్ దయాల్ చారి. ఆకుల పెంటయ్య. దుర్గేష్ తదితరులు పాల్గొని పోస్టర్ లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తన 60 ఏండ్ల జీవితాన్ని ప్రజలకు, ప్రజా యుద్ధానికి, పీడిత ప్రజల విముక్తి కోసం అంకితం చేసి, ప్రజలకు తన పాటను అంకితం చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ భౌతికంగా దూరమై మూడేళ్లు గడుస్తున్నాయని చెప్పారు. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు, బోధించిన ఆకాంక్షలు, ఆయన పాట ఇంకా ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని అన్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ కు మరణం లేదని, ఆయన చూపించిన మార్గంలో అసమ సమాజాన్ని అంతం చేసే వరకు ప్రజల పోరాటం కొనసాగుతుందని తెలిపారు. మెదక్ జిల్లాకు గద్దర్ పేరును పెట్టాలని వారు డిమాండ్ చేశారు. గద్దర్ ఆశయాలను కొనసాగించడం కోసం గద్దర్ కుమారుడు సూర్యం ఆధ్వర్యంలో గద్దర్ ఫౌండేషన్ ఏర్పడిందని పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6న హైదరాబాద్ రవీంద్రభారతిలో సాయంత్రం 4 గంటలకు వర్ధంతి సభజరుగుతుందని తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలో స్టేడియం వద్ద జరుగు వర్ధంతి సభకు గద్దర్ అభిమానులు,కవులు, రచయితలు, కళాకారులు, గాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన యువ నాయకుడు బిజెపి బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జ్ బీజేపీ నేత, ఎన్నారై కోనేరు శశాంక్



కోటగిరి), ఆగస్టు 5:(జన సంఘర్షణ)



కోటగిరి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నిరడి సుజాత కుమార్తె సావిత్రి (16) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని స్థానిక బీజేపీ నాయకుల ద్వారా తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకుడు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించిన ఆయన, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కోనేరు శశాంక్ చూపిన మానవతా దృక్పథాన్ని అభినందిస్తూ, ఆపదలో ఉన్న కుటుంబానికి వెంటనే చేయూత అందించడం ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోటగిరి బీజేపీ మండల అధ్యక్షుడు ఏముల నవీన్, బీజేపీ బూత్ అధ్యక్షుడు గంజిగావ్ శేఖర్, గ్రామ పెద్దలు శివనంద్, బుమయ్య, గంగారాం, అనిల్, నిరడి సంతోష్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి భూదాత రెడ్డిబోయిన నాగేశ్వరరావు చేయూత

◆ ఉసిరికాయలపల్లిలో టైలరింగ్ కేంద్రం ప్రారంభం
◆ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో రెండు అభివృద్ధి కార్యక్రమాలు

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో గ్రామాభివృద్ధి, మహిళా సాధికారతకు ఊతమిచ్చే రెండు ముఖ్యమైన కార్యక్రమాలు సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటగా గ్రామానికి చెందిన భూదాత రెడ్డిబోయిన నాగేశ్వరరావు, తన తల్లిదండ్రులు చౌడయ్య-పెంటమ్మల జ్ఞాపకార్థంగా గ్రామపంచాయతీకి ఒక గుంట భూమిని విరాళంగా అందజేశారు. గ్రామాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఈ భూమిని వినియోగించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రయోజనాల కోసం స్వచ్ఛందంగా భూమిని విరాళంగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం విజేత మండల సమాఖ్య సౌజన్యంతో ఏర్పాటు చేసిన టైలరింగ్ కేంద్రాన్ని ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు అవసరమైన యూనిఫాంల కుట్టు పనులను ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి పెంపొందుతుందని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఒకవైపు భూదాతలు ముందుకు రావడం, మరోవైపు మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టడం గ్రామ ప్రగతికి దోహదపడుతుందని అన్నారు.భూదాత రెడ్డిబోయిన నాగేశ్వరరావు సేవాభావాన్ని గ్రామ పెద్దలు అభినందించగా, మహిళా సంఘాల సభ్యులు టైలరింగ్ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన విజేత మండల సమాఖ్యకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, ఏపీఎం, సీసీ శ్రీనిధి, విజేత మండల సమాఖ్య మేనేజర్, వీవో అధ్యక్షురాలు, వీవోఏ సభ్యులు, పాలకమండలి సభ్యులు, గ్రామ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిజెపి మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మెదక్ టీఎన్జీవో భవన్లో జిల్లా సమావేశం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)

భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ కిసాన్ మోర్చా మెదక్ జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులు కొండ రాములు పోతుల చైతన్య ఎలకతోర్తి దుర్గయ్య ఎన్న లింగ రెడ్డి గొల్ల రాజు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి మెంగర్తి రంగయ్య జిల్లా ప్రధాన కార్యదర్శులు పాపన్నగారి ఏసీ రెడ్డి సర్పంచ్ ఆకుల రమేష్ జనార్ధన్ జిల్లా కార్యదర్శి కటికే కార్తిక్ ,పరికి నాగులు,గొల్ల గోపాల్, దుర్గా గౌడ్,కుక్కల వెంకట్, కమ్మరి వెంకటేశం, జిల్లా కోశాధికారి సుదర్శన్, జిల్లా అధికార ప్రతినిధి పోలీస్ దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కుస్తీ శంకర్,లింగాల సూర్య, బాబు, మల్లంపేట చంద్రయ్య,మల్లేశం యాదవ్, సక్రు నాయక్,మన్నె అశోక్




శ్రీనివాస్,శ్రీనివాస్ రెడ్డి, గార్లకు పదవులు ఇవ్వడం జరిగింది. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రైతుల కోసం రైతుల సమస్యల కోసం ఎల్లవేళలా బిజెపి పార్టీ పోరాడుతుంది. అని చెప్పడం జరిగింది. అదేవిధంగా నూతన కిసాన్ మోర్చా జిల్లా కమిటీకి హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు,



ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు గడ్డం కాశీనాథ్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్,మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎల్.ఎన్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సర్పంచ్ బాలరాజు, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఖిచ్చి గ్యన్ సింగ్, జిల్లా నాయకులు సిద్ధిరాములు, మండల అధ్యక్షులు సర్పంచ్ బెండె వీణ, శ్రీనివాస్, హరీశ్,మండల ప్రధాన కార్యదర్శులు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలు, తొట్టెల ఊరేగింపు

◆ ముత్యాలమ్మ ఫలహారం బండి తొట్టెల ఊరేగింపు.
◆ మహోత్సవాలకు కంఠరెడ్డి తిరుపతిరెడ్డికి ఆహ్వానం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలు, తొట్టెల మహోత్సవం, శ్రీ ముత్యాలమ్మ పలహారం బండి, తొట్టెల ఊరేగింపు, సగర ఆధ్వర్యంలో శ్రీ మహంకాళి అమ్మవారి తొట్టెల ఊరేగింపు మహోత్సవాలకు విచ్చేసి విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.ఈ మహోత్సవాలకు తప్పకుండా హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి.మాణిక్య రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంపై అవగాహన కల్గి ఉండాలి

◆ డి ఆర్ వో అంబదాస్ రాజేశ్వర్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)



భూ భారతి చట్టంపై అవగాహన కల్గి ఉండాలని డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. బుధవారం కలెక్టర్ లోని మీటింగ్ హాల్లో రెవెన్యూ సిబ్బందికి ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. రెవెన్యూలో పని చేసే జూనియర్ అసిస్టెంట్లు కీలకంగా విధులు నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం భూ రికార్డుల నిర్వహణను మెరుగుపరచడానికి, పాత వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడానికి తీసుకువచ్చిన సమగ్ర నూతన రెవెన్యూ భూ హక్కుల చట్టమే భూ భారతి చట్టం అన్నారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

◆ నకిలీ స్టాక్ మార్కెట్ ప్రకటనలను నమ్మొద్దు
◆ ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే జాగ్రత్త
◆ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి
◆ మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా వ్యవహరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు. జాతీయ 'సైబర్ జాగృత్ దివస్' సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా-సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ప్రతిరోజూ సైబర్ నేరాల కారణంగా కోట్ల రూపాయలను ప్రజలు నష్టపోతున్నారని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలను చూసి మోసపోవద్దని సూచించారు. మోసగాళ్లు ముందుగా వాట్సాప్ గ్రూపుల్లో చేర్చి, కొందరు వ్యక్తులు భారీగా లాభాలు పొందినట్లు నకిలీ స్క్రీన్‌షాట్లు, సందేశాలను షేర్ చేస్తారని చెప్పారు. వాటిని నమ్మి పెట్టుబడులు పెడితే తొలుత కొద్దిమొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించి, అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించిన తర్వాత మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వివిధ రకాల ఫీజుల పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఒకసారి డబ్బులు చెల్లించిన తర్వాత మరో ఫీజు, ఇంకో ఫీజు అంటూ వరుసగా డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. చివరకు భారీ మొత్తంలో డబ్బులు కోల్పోయిన తర్వాతే మోసపోయిన విషయం బాధితులకు తెలుస్తుందన్నారు. ఉద్యోగం ఇచ్చే సంస్థ అభ్యర్థికి జీతం చెల్లిస్తుంది కానీ, ఉద్యోగం ఇచ్చేందుకు అభ్యర్థి నుంచి డబ్బులు ఎందుకు అడుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు తదితర సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు సైబర్





భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ కుటుంబసభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ కోరారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరించినప్పుడే 'సైబర్ స్వతంత్ర తెలంగాణ' లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చివరగా విద్యార్థులతో సైబర్ అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,ఐపీఎస్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. హుస్సేన్, డా.టి.మల్లేశం, వి. మురళి, డాక్టర్ ఆర్.శ్రీలత, సైబర్ క్రైమ్ సిబ్బంది సతీష్, సయ్యద్, సాయికిరణ్, స్వప్న, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# తండ్రికి ఆన్‌లైన్‌లో అంత్యక్రియలు వీక్షించిన కుమార్తెలు..

◆ హరియాణాలో హృదయవిదారక ఘటన

హరియాణా /ఆగస్టు 5/: (జన సంఘర్షణ)



కుటుంబ బంధాల విలువపై ఆలోచింపజేసే ఘటన హరియాణాలోని సోనిపట్‌లో చోటుచేసుకుంది. వృద్ధ తండ్రి మరణించినప్పటికీ ఆయన ముగ్గురు కుమార్తెలు వ్యక్తిగతంగా వచ్చేందుకు నిరాకరించినట్లు సమాచారం. దీంతో పెద్ద కుమార్తె స్థానిక స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జీఓ)కు అంత్యక్రియల ఖర్చుల కోసం డబ్బు పంపి, వీడియో కాల్ ద్వారా తండ్రి అంత్యక్రియలను వీక్షించినట్లు తెలుస్తోంది. అనంతరం ఎన్‌జీఓ ప్రతినిధులు అస్థికలను తీసుకెళ్తారా అని అడగ్గా, "తర్వాత చూద్దాం" అని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా, "అంత్యక్రియలు ఎప్పుడు పూర్తవుతాయో చెప్పండి.. ఆ తర్వాత భోజనం చేస్తాం" అని చెప్పినట్లు కూడా వార్తలు పేర్కొంటున్నాయి. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీసింది.

# పాలమూరు-రంగారెడ్డి సహా నాలుగు కీలక సాగునీటి ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు ఇవ్వాలి

◆ **కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

రంగారెడ్డి । ఆగస్టు 5 । (జన సంఘర్షణ)

తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి పార్లమెంట్లో కేంద్ర మంత్రిని కలిసిన సీఎం, ఇటీవల సుప్రీంకోర్టు తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, పెండింగ్లో ఉన్న పర్యావరణ అనుమతులను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్లు వ్యయం చేసిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనుమతుల జాప్యం కారణంగా ప్రాజెక్టుల పనులు నిలిచిపోయి, నిర్మాణ వ్యయం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్న ఆయన, తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఆలస్యం లేకుండా పర్యావరణ అనుమతులు జారీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేమ్ నరేందర్ రెడ్డి, డా. మల్లు రవి, రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డా. కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ



సలహాదారు ఆదిత్యనాథ్ దాస్తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు లభిస్తే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల చిరకాల నిరీక్షణకు ముగింపు పలుకుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# కామారెడ్డిలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్..

◆ **నేరస్తులకు పోలీసుల గట్టి హెచ్చరిక!**

కామారెడ్డి,/ ఆగస్టు 5: /( జన సంఘర్షణ)

జిల్లాలో వరుస దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేర ముఠాను కామారెడ్డి పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన అలీ రజాక్, నాసిర్, సాధిక్, షాహిద్లతో పాటు పశ్చిమ బెంగాల్కు చెందిన ఫైజాన్ను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు. పోలీసుల విచారణలో నిందితులపై తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో 80కి పైగా దొంగతనం, దోపిడీ కేసులు నమోదైనట్లు తేలింది. వారి వద్ద నుంచి రూ.4 వేల నగదు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసులు నేరస్తులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. దొంగతనాలు, దోపిడీలు, చోరీలు, ఇతర నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమేనని, నేరం చేసిన ప్రతి ఒక్కరికీ శిక్ష తప్పదని స్పష్టం చేశారు. జిల్లాలో నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల అప్రమత్త చర్యలతోనే సమాజాన్ని నేరరహితంగా మార్చగలమని అధికారులు పేర్కొన్నారు. "నేరం చేసినవారికి శిక్ష తప్పదు... ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల తొలి ప్రాధాన్యం. చట్టాన్ని అతిక్రమించే ప్రతి ఒక్కరిపై కఠిన




చర్యలు తప్పవు." అని జిల్లా పోలీసులు మరోసారి స్పష్టం చేశారు.

# ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు

◆ **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)

06-08-2026 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు నిర్వహించబడతాయనీ, రైతులకు నాణ్యమైన ఎరువులను సకాలంలో, పారదర్శకంగా అందించడంతో పాటు ఎరువుల పంపిణీ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఎఫ్ఎఫ్ఎస్ అనే నూతన డిజిటల్ ప్లాట్ఫారమ్ (యాప్)ను దేశవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ఎరువుల కొనుగోలు, పంపిణీ, నిల్వలు, సబ్సిడీ, విక్రయాల పర్యవేక్షణ తదితర ప్రక్రియలన్నీ ఒకే వేదికపై నిర్వహించబడనున్నాయనీ తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో అమలులో ఉన్న యూరియా బుకింగ్ యాప్ ద్వారా ప్రధానంగా యూరియా విక్రయాలు మాత్రమే నమోదు చేయబడేవి, ప్రస్తుతం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ వ్యవస్థలో యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్పీకే కాంప్లెక్స్ ఎరువులు సహా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు ఈ డిజిటల్ వ్యవస్థ ద్వారానిర్వహించబడతాయన్నారు. ఎఫ్ఎఫ్ఎస్ యాప్ వ్యవస్థ వల్ల ఎరువుల పంపిణీలో సంపూర్ణ పారదర్శకతను తీసుకురావడం,రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడడము,ఎరువుల నిల్వలు, విక్రయాలు, సబ్సిడీ ప్రక్రియలను పర్యవేక్షించడం, ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ను నియంత్రించడం,కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ సరైన లబ్ధిదారులకు చేరేలా చూడడం, డిజిటల్ రికార్డుల ద్వారా బాధ్యతాయుతమైన పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయడం.జరుగుతుందన్నారు.

**రైతులు ఎరువులు పొందే విధానం.**

రైతులు ముందుగా తమ మొబైల్ నంబర్ మరియు అవసరమైన వివరాలతో ఎఫ్ఎఫ్ఎస్ యాప్లో నమోదు చేసుకోవాలి. అనంతరం సాగు పంట, విస్తీర్ణం, అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేసి సమీపంలోని ఎరువుల డీలర్ను ఎంపిక చేసుకోవాలి. అనంతరం ఎఫ్ఎఫ్ఎస్ యాప్ రైతుకు ప్రత్యేక ౹ఌ= కోడ్ను రూపొందిస్తుంది. రైతు ఎంపిక చేసిన డీలర్ వద్దకు వెళ్లి ఆ ౹ఌ= కోడ్ను చూపించాలి. డీలర్ ఎఫ్ఎఫ్ఎస్ యాప్ లేదా ూౠ పరికరం ద్వారా ౹ఌ= కోడ్ను స్కాన్ చేసిన తర్వాత రైతు వివరాలు, ఎరువుల వివరాలు ధృవీకరించబడతాయనీ, అనంతరం రైతుకు ఎరువులు అందజేయబడతాయి. విక్రయం పూర్తయిన వెంటనే ఆ సమాచారం కేంద్ర ఎఫ్ఎఫ్ఎస్ సర్వర్లో నమోదు అవుతుంది. దీంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎరువుల పంపిణీని పక్కగా పర్యవేక్షించగలుగుతాయినీ తెలిపారు.

**రైతులకు కలిగే ప్రయోజనాలు.**

ఎరువుల కోసం అనవసరంగా వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుందనీ,పారదర్శకమైన పంపిణీ వ్యవస్థ ద్వారా సరైన రైతుకు సరైన ఎరువు అందుతుందన్నారు. ఎరువుల లభ్యతపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంటుంది.సబ్సిడీ ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతుంది.

ముఖ్య గమనిక: 05-08-2026 (రేపు) సాయంత్రం 5.00ౡవీ వరకు మాత్రమే ప్రస్తుతం అమలులో ఉన్న పాత ఎరువుల విక్రయ యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతాయి. 06-08-2026 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు నిర్వహించబడతాయి. కావున రైతులు ఎలాంటి అపోహలు లేదా సందేహాలకు గురికాకుండా, ఎఫ్ఎఫ్ఎస్ వ్యవస్థకు సహకరించి ఎరువులు కొనుగోలు చేయాలని కోరుతున్నాము. ఎఫ్ఎఫ్ఎస్ నమోదు, ౹ఌ= కోడ్, ఎరువుల కొనుగోలు విధానం లేదా ఇతర వివరాలపై ఏవైనా సందేహాలు ఉంటే, తమ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారి (ూజుూ) సంప్రదించగలరనీ, జిల్లాలోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఖీఖీ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల పంపిణీ జరిగేలా అవసరమైన చర్యలు చేపడుతున్నాము. రైతులు ఈ నూతన ఎఫ్ఎఫ్ఎస్ వ్యవస్థను పూర్తిగా వినియోగించుకొని, ఎరువుల పంపిణీలో పారదర్శకత మరియు సమర్థతను పెంపొందించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.ప్రస్తుతం జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా సుమారు 2,846 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి.రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేసి వినియోగించుకోవాలనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



# బాలికపై లైంగిక దాడి. నిందితుడికి 20 ఏళ్ల జైలు.

◆ **రూ.20 వేల జరిమానా. బాధితురాలికి రూ.లక్ష పరిహారం.**

◆ **నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని అభినంధించిన మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి.శ్రీనివాస రావు.**




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)

15 ఏళ్ల బాలికను మాయమాటలు చెప్పి అపహరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు అక్తర్కు(22) జిల్లా ఫాస్ట్ట్రాక్ పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించిందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. బాధితురాలికి రూ.లక్ష పరిహారం మంజూరు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. పాన్షాప్ నిర్వహిస్తున్న అక్తర్ 15 ఏళ్ల బాలికను మాయమాటలతో నమ్మించి అపహరించి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఎస్పీ తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ 2024 ఏప్రిల్లో కేసు నమోదు చేశారని చెప్పారు. అనంతరం అప్పటి కేసు దర్యాప్తు అధికారి, రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్షీట్ దాఖలు చేశారని తెలిపారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించారని ఎస్పీ పేర్కొన్నారు .ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ఫాస్ట్ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు అక్తర్ను దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారని జిల్లా ఎస్పీ తెలిపారు.బాధితురాలికి రూ.లక్ష పరిహారం మంజూరు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడేలా పటిష్టమైన దర్యాప్తు చేపట్టి,కోర్టులో బలమైన సాక్ష్యాధారాలు సమర్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అప్పటి నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్, అప్పటి రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్,లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ,సీడీఓ సాయిబాబా,భరోసా లీగల్ అడ్వైసర్ శ్వేతా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్యలను ఎస్పీ అభినందించారు.

# తారకరామానగర్ కాలనీలో నల్ల పోచమ్మ అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణ

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)





మెదక్ పట్టణంలోని తారకరామానగర్ కాలనీలో శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల అనంతరం బుధవారం భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ స్వరూప,మాజీ కౌన్సిలర్ అనిల్ కుమార్, సాయి కుమార్, చంద్రయ్య, కృష్ణమూర్తి, శివ కుమార్, శివ కుమార్, బ్రాహ్మయ్య,అశోక్, శ్రీనివాస్, సీతారాం, శ్రీను, శివ, విష్ణు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీ మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

# వేధింపులపై భయపడొద్దు

◆ **షీ టీమ్స్కు ఫిర్యాదు చేయండి.**

◆ **బాలికల భద్రతపై షీ టీమ్స్ అవగాహన.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)




మహిళలు, బాలికల భద్రతపై షీ టీమ్స్ సిబ్బంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తూప్రాన్లోని మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ సిబ్బంది స్వరూప మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, ఈవ్టీజింగ్, అసభ్యకర ప్రవర్తనను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే వేధింపులు, ఇబ్బందులను భయపడకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని,అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్వర్డ్లు, ఓటీపీలు తదితర సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్కాల్స్, మెసేజ్లు, లింకుల ద్వారా మోసాలకుపాల్పడుతున్నారని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. ఆన్లైన్లో పరిచయమైన వ్యక్తులను పూర్తిగా నమ్మి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని తెలిపారు. మహిళలు, బాలికలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు,కళాశాల యాజమాన్యం లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. షీ టీమ్స్ అందిస్తున్న సేవలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
గురువారం
06 ఆగస్టు 2026

# డ్రైనేజీని ఢీకొని కారు బోల్తా... రోడ్డు నిర్మాణ లోపాలపై గ్రామస్తుల ఆందోళన

రుద్రూర్, /ఆగస్టు 5/ (జన సంఘర్షణ):

రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను కలవరపరిచింది. బోధన్ నుంచి వర్ని వైపు వెళ్తున్న TG 16 B 4497 నంబర్ గల షిఫ్ట్ డిజైర్ కారు రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీని ఢీకొని బోల్తా పడింది. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు వెంటనే తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న ఫుల్ సింగ్ సురక్షితంగా బయటపడ్డారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో కొంతసేపు ఆ మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.



సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి బోల్తా పడిన కారును రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో అవసరమైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల్లోనే ఇదే ప్రాంతంలో మూడు ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణంలో ఉన్న లోపాలను సరిదిద్దడంతో పాటు నిర్లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్న నిర్మాణ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# వ్యభిచార వృత్తిని వీడి గౌరవప్రద జీవనం సాగించేలా చర్యలు

- ఉపాధి చూపి జనజీవనంలోకి తీసుకురావాలన్న సంకల్పం.
- గౌరవంగా జీవించేలా చేయడమే పోలీసుల సంకల్పం.
- మహిళలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో కృషి.
- డీఎస్పీ నరేందర్ గౌడ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా నార్సింగ్ మండలంలోని ఓ గ్రామం వద్ద స్థిరపడి ఉన్న వ్యభిచార వృత్తిని వీడి గౌరవప్రదమైన జీవనం సాగించేలా మహిళలకు అండగా నిలిచి, వారిని జనజీవన ప్రవంతిలో కలిపేందుకు పోలీస్ శాఖ దృఢ సంకల్పంతో పనిచేస్తోందని డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరోజినీనగర్ వద్ద జాతీయ రహదారి పక్కన కొంతమంది మహిళలు వ్యభిచార వృత్తిలో కొనసాగుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు,ఆదేశాల మేరకు వారం రోజుల క్రితం అక్కడ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 16 మందిని గుర్తించి, వారిని షెల్టర్ హోమ్‌కు తరలించారు. అనంతరం వారిని వ్యభిచార వృత్తి నుంచి బయటకు తీసుకువచ్చి, గౌరవప్రదమైన జీవనం సాగించేలా పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా వారికి ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. డిఆర్డిఏ, ఆర్డీవోతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని మహిళలకు అందించాల్సిన శిక్షణ, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించారు. వారి నైపుణ్యాలను గుర్తించి తగిన శిక్షణ అందించడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు. మహిళలు తిరిగి వ్యభిచార వృత్తిలోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి, సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు కృషి చేస్తాయని పేర్కొన్నారు.మహిళలు, బాలికల భద్రతతో పాటు సామాజికంగా వెనుకబడిన వారికి రక్షణ, పునరావాసం




కల్పించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని డీఎస్పీ తెలిపారు. సరోజినీనగర్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ నరేందర్ గౌడ్ ప్రారంభించారు. జాతీయ రహదారి పరిసరాల్లో నిఘా మరింత పటిష్టం చేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ టి ఏ, ఆర్డీవో రామాయంపేట్ సీఐ సైదా,నార్సింగి ఎస్ఐ సృజన, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పుణ్యం మోహన్వితకు యల్‌ఓసి

- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు 3 మూడు లక్షల రూపాయల యల్ ఓ సి అందజేత.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం నియోజకవర్గం, ఆగష్టు 05(జనసంఘర్షణ):



భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వెంకటాపురం మండలం సురవీడు గ్రామానికి చెందిన పుణ్యం మోహన్వితకు వైద్య చికిత్స నిమిత్తం రూపాయలు 3,00,000 లక్షలు విలువైన ఎల్ ఓ సి, లెటర్ అఫ్ క్రెడిట్,ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తన చేతుల మీదుగా అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు వైద్య సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే కి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, పెద్దినేని శ్రీనివాస్, బొల్లినేని ధర్మారావు, యూత్ నాయకులు గాడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ మోసలపై అవగాహనా

- డి ఎస్ పి అరుణ్ కుమార్
- సి ఐ రాజు వర్మ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 05(జనసంఘర్షణ):




చర్ల మండలంలో, సురక్షక తిరంగా కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ మోసాలపై చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించిన పోలీస్ శాఖ, విద్యాశాఖ, పాల్గొన్న భద్రాచలం డి.ఎస్.పి అరుణ్ కుమార్, సీఐ రాజువర్మ , ఎస్సైలు పి కేశవ్, ఆర్ నర్సిరెడ్డి, ప్రిన్సిపల్ నరేందర్, పలువురు జూనియర్ లెక్చరర్లు, జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి భూదాత రెడ్డిబోయిన నాగేశ్వరరావు చేయూత

- ఉసిరికాయలపల్లిలో టైలరింగ్ కేంద్రం ప్రారంభం
- సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో రెండు అభివృద్ధి కార్యక్రమాలు

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్






మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీలో గ్రామాభివృద్ధి, మహిళా సాధికారతకు ఊతమిచ్చే రెండు ముఖ్యమైన కార్యక్రమాలు సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటగా గ్రామానికి చెందిన భూదాత రెడ్డిబోయిన నాగేశ్వరరావు, తన తల్లిదండ్రులు చౌదయ్య -పెంటమ్మల జ్ఞాపకార్థంగా గ్రామపంచాయతీకి ఒక గుంట భూమిని విరాళంగా అందజేశారు. గ్రామాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఈ భూమిని వినియోగించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రయోజనాల కోసం స్వచ్ఛందంగా భూమిని విరాళంగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం విజేత మండల సమాఖ్య సౌజన్యంతో ఏర్పాటు చేసిన టైలరింగ్ కేంద్రాన్ని ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు అవసరమైన యూనిఫాంల కుట్టు పనులను ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి పెంపొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఒకవైపు భూదాతలు ముందుకు రావడం, మరోవైపు మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టడం గ్రామ ప్రగతికి దోహదపడుతుందని అన్నారు. భూదాత రెడ్డిబోయిన నాగేశ్వరరావు సేవాభావాన్ని గ్రామ పెద్దలు అభినందించగా, మహిళా సంఘాల సభ్యులు టైలరింగ్ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన విజేత మండల సమాఖ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, ఏపీఎం, సీసీ శ్రీనిధి, విజేత మండల సమాఖ్య మేనేజర్, వీవో అధ్యక్షురాలు, వీవోఏ సభ్యులు, పాలకమండలి సభ్యులు, గ్రామ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని ఎంపీలు కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి పనులపై కేంద్ర, రవాణా జాతీయ అధ్యక్షుడు నితిన్ గడ్కరీ తో సమావేశం.

- మెదక్ జిల్లాలోనీ రామాయంపేటబిసిద్దిపేట జాతీయ రహదారి పనులను సరిత గతిన వేగవంతం చేయాలి.
- సూర్యాపేట సిరిసిల్ల నూతన జాతీయ రహదారి నిర్మాణాన్ని సరిత గతిన చేపట్టి పూర్తిచేసే అంశంపై కేంద్రమంత్రి తో చర్చ.
- మెదక్ జిల్లాలోని ఎంపీలు మంతనాలు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)

తెలంగాణ బీజేపీ ఎంపీలు ఈటెల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి,గోడం నగేష్ గారితో కలిసి తెలంగాణలోని జాతీయ రహదారుల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించాలని కోరుతూ కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల శాఖ మంత్రి, నితిన్ గట్కరి ని కలిసిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు. ఈ సందర్భంగా రామాయంపేట-సిద్దిపేట జాతీయ రహదారి పనులను వేగవంతం చేయడం,అలాగే సూర్యాపేట--సిరిసిల్ల నూతన జాతీయ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి పూర్తి చేసే అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించడం జరిగిందని తెలిపారు.

# మున్నూరు కాపు సమాజ అభ్యున్నతే లక్ష్యం...

- కోకాపేటలో చైర్మన్ బొమ్మ శ్రీనివాస్ చక్రవర్తిని..."
- మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర కో-కన్వీనర్ దోంగ్లి శ్రీనివాస్.....


హైదరాబాద్,/ ఆగస్టు 5:(జన సంఘర్షణ)



మున్నూరు కాపు సమాజ సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కోకాపేటలోని మున్నూరు కాపు సంఘ భవనంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీనివాస్ చక్రవర్తి గారిని రాష్ట్ర కో-కన్వీనర్ డోంగ్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సమాజ అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల విస్తరణ, యువతకు ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి అవకాశాల కల్పన, సంఘ బలోపేతానికి అవసరమైన కార్యాచరణపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగుతూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. సామాజిక ఐక్యత, పరస్పర సహకారంతోనే మున్నూరు కాపు సమాజం మరింత పురోగతి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగగా, సమాజాభివృద్ధికి కలిసి పనిచేయాలనే సంకల్పాన్ని నాయకులు వ్యక్తం చేశారు.

# రెండువ విడుత ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో నేరుగ్ణా ప్రవేశాలు (వాక్-ఇన్ అడ్మిషన్లు)

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5(జన జన సంఘర్షణ)



2026- 27 విద్యా సంవత్సరనికి గాను మెదక్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో సంబంధించన ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై రెండువ విడత "వాక్-ఇన్ " అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని మెదక్ జిల్లా కన్వీనర్ ఒప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గుమ్మకొండ శ్రీనివాస్ ఒక్క ప్రకటనలో తెలిపారు. ఐటిఐలలో 8వ లేదా10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు.కనీస వయస్సు 01-08-2026 నాటికి 14 సంవత్సరాలు పూర్తయి ఉండాలి (గరిష్ట వయోపరిమితి లేదు)ఈ నెల 05-08-2026 నుండి 15-08-2026 వరకు అడ్మిషన్లు నిర్వహించబడతాయని చెప్పారు.ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక iti.telangana.gov.in లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.గతంలో మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. హాజరుకావాల్సిన ప్రతీ రోజుఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 పీఎం వరకు దరఖాస్తులను పరిశీలించి, మెరిట్ ఆధారంగా రోజూ సీట్లు కేటాయిస్తారనిఅభ్యర్థులకు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌తో నేరుగా కళాశాలకు వచ్చి తమకు ఇష్టమైన ట్రేడ్‌లో ప్రవేశం పొందవచ్చని ప్రిన్సిపాల్ తెలియజేశారు.అందుబాటులో ఉన్న ఖాళీ సీట్ల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయడం జరుగుతుందని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# మెదక్ జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కమిటీని నూతనంగా ఎన్నుకోబడింది

- జిల్లా ఓబీసీ జనరల్ సెక్రెటరీగా చింతల శేఖర్ ఎన్నిక.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)



బిజెపి మెదక్ జిల్లా జరిగిన కార్యక్రమంలో జరిగిన కిసాన్ మోర్చా జిల్లా కమిటీలో మెదక్ జిల్లా కిసాన్ మోర్చా సెక్రెటరీగా నూతనంగా ఎన్నికైన కటిక కార్తీక్ లు ఎన్నిక అయ్యారు. మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా కమిటీలో మెదక్ జిల్లా ఓబీసీ జనరల్ సెక్రటరీగా నూతనంగా చింతల శేఖర్ ఎన్నికయ్యాడు. జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన ఆకుల రమేష్ నందిగామ గ్రామ సర్పంచ్, మెదక్ జిల్లా కార్యక్రమంలో జిల్లా కమిటీ లో రామయంపేట పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చిన్నోళ్ల నాగరాజు వీరిని ఎన్నుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# వైరా నియోజకవర్గమంతా మిషన్ వాక్ సేవల విస్తరణకు కార్యాచరణ..

- సింగరేణి మండల కమిటీ కీలక నిర్ణయాలు
- గ్రామాల వారీగా బాధితుల గుర్తింపు..
- వైద్య, ఫిజియోథెరపీ సేవలను మరింత విస్తరించాలని నిర్ణయం

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్



మిషన్ వాక్ సేవా సంస్థ ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సింగరేణి మండల కమిటీ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. రాబోయే రోజుల్లో చేపట్టనున్న సేవా కార్యక్రమాలు, గ్రామాల వారీగా కార్యాచరణ, బాధితులను గుర్తించి వారికి సమర్థవంతమైన సేవలు అందించే విధానాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి సన్నిహిత మిత్రుడు, భారత ఆర్మీ హావల్దార్ బనోత్ దశరథ్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మిషన్ వాక్ సేవలను చేరవేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వికలాంగులు, హార్ట్ స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్ బాధితులతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అవసరమైన వైద్య సేవలు, ఫిజియోథెరపీ, పునరావాస సహాయాన్ని మరింత సమర్థవంతంగా అందించేందుకు వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో అర్హులైన బాధితులను గుర్తించి సంస్థ దృష్టికి తీసుకురావాలని, సేవలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మానవత్వం, సేవాభావం, నిబద్ధతతో సమాజంలోని ప్రతి అవసరమైన వ్యక్తికి అండగా నిలవడమే మిషన్ వాక్ సంస్థ ధ్యేయమని అన్నారు. సమావేశానికి సింగరేణి మండల మిషన్ వాక్ కమిటీ సభ్యులు బోడ రవి అధ్యక్షత వహించారు. సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలను గ్రామ స్థాయిలో మరింత విస్తరించేందుకు మండల కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అంగోత్ రాముడు, ఖమ్మం జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు షేక్ షరీఫ్ పాషా (షరీఫ్ రంగా), రాయల శ్రీను, భూక్యా రవీందర్, గుగులోత్ నరేష్, సాగర్, బాలు చౌహాన్, బాషా, సాయి, హాట్కార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా రామాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక వేలంపాట

- 99 మంది వేలంపాటలో పాల్గొన్నారు.
- 30 టన్నుల ఇసుక 2.18 లక్షలకు వేలం.
- వేలం పాట పాడి ఇసుకను దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జన సంఘర్షణ)





అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రామాయంపేట తహసిల్దార్ రజిని కుమారి బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఇసుక వేలం పాట నిర్వహించారు మొత్తం 30 టన్నుల ఇసుక వేలం పాట 9 9 మంది వేలం పాటలో పాల్గొన్నారు. అత్యధికంగా 2.18 లక్షలకు వేలం పాట పాడి దంతపల్లి సర్పంచ్ బాలరాజ్ ఇసుక స్వార్థం చేసుకున్నాం. ప్రభుత్వ అవసరాలకు ఇసుక ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట తహసిల్దార్ రజనీకుమారి. ఆర్ ఐ,లు రెవెన్యూ సిబ్బంది. దంతపల్లి సర్పంచ్ బాలరాజ్ ఎంఆర్పిఎస్ నాయకులు పాతూర్ రాజు.మల్లారెడ్డి. నరేందర్.తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్ పాలకవర్గానికి మాల సంఘం ఘన సన్మానం




కోటగిరి, /ఆగస్టు 5:/(జన సంఘర్షణ)

కోటగిరి మండల కేంద్రంలోని పాత్రికేయుల సమావేశ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులను మాల సంఘం బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు మిర్జాపూర్ చిన్న సాయన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిర్జాపూర్ చిన్న సాయన్న మాట్లాడుతూ, ప్రజలకు--ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే బాధ్యతను పాత్రికేయులు సమర్థంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ఉమ్మడి మండలాల పాత్రికేయులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పూలకంటి కృష్ణకుమార్, ఉపాధ్యక్షుడు పుప్పాల సైదయ్య, ప్రధాన కార్యదర్శి భూరుబోయిన సాయిలు, కోశాధికారి గాయక్వాడ్ రాము, సహాయ కార్యదర్శి ఫ్యాట్ల పెంటయ్య, ముఖ్య సలహాదారు బ్యాగరి రాములు, కొత్తపల్లి సర్పంచ్ పుప్పాల గంగారం, యాదగర్‌పూర్ సర్పంచ్ గౌస్, కోటగిరి మాల సంఘం ప్రధాన కార్యదర్శి రాములు, కార్యవర్గ సభ్యులు బాల గంగారం, శివశంకర్, శేషారావు, కొత్తపల్లి సాయిలు, యాదగర్‌పూర్ ఉప సర్పంచ్ లాలయ్య, జంగం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్

- ఎరువులన్ని ఫెర్టిలైజర్ యాఫ్ తోనే అమ్మకాలు
- పట్టాలు కాని రైతులకు ఎన్డీఎస్ క్రింద బుక్ చేసుకోవచ్చు - ఏడీఏ కరుణశ్రీ

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్



దేశ వ్యాప్తంగా ఒకే పాలసీ విధానంతో ఎరువుల క్రయ, విక్రయాలు జరగాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రభుత్వం నూతనంగా ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ యాఫ్ నుతీసుక వచ్చిందని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. బుధవారం కారేపల్లిలోని ఎరువుల దుకాణాలు, సోసైటీ సేల్ పాయింట్లను ఏడీఏ తనిఖీలు చేశారు. ఈసందర్బంగా రైతులనుద్దేశించి ఏడీఏ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయశాఖ రుపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాఫ్ ద్వారా యూరియా అమ్మకాలను సాగిస్తుండగా దాని విస్తృత పరచాలని ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం దీనినిస్పూర్తిగా తీసుకోని దేశ వ్యాప్తంగా అమలు చేయటానికి నూతనంగా ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాఫ్ ను తీసుకవచ్చిందన్నారు. 6వ తేది నుండి అన్ని ఎరువులు ఆదే యాఫ్ ద్వారా అమ్మకాలు సాగుతాయన్నారు. రైతులు ఈ యాప్ ను ఇన్ స్టాల్ చేసుకోని ఆధార్ కార్డు లేదా ఫార్మర్ ఐడీ ద్వారా లాగిన్ అవ్వాల్సి ఉంటుందన్నారు. భూమి ఉండి పట్టా కాని వారు, కౌలు దారులు, నాన్ డిజిటల్ సిగ్నేషర్(ఎన్డీఎస్) క్రింద ఫోన్ నెంబర్ తో లాగిన్ అవ్వాలన్నారు. యాప్ లోకి వెళ్లిన తర్వాత యాఫ్ లో ఉన్న రైతు భూమి వివరాలకు సంబంధించి పంట వివరాలు నమోదు చేయాల్సి ఉంటుదన్నారు. నాన్ డీఎస్ రైతులు భూమి సర్వే నెంబర్లు, భూ విస్తీరణం యాడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీని తర్వాత జీఎఫ్ఆర్ విధానంలో ఎరువులు నిర్ణయించటం జరుగుతుందన్నారు. దానికి మించి కావల్సినావారు ఎరువులమోతాదును పెంచుకోని కొనుగోలు చేయవచ్చున్నారు. దీని ద్వారా జనరేట్ అయిన బుకింగ్ ఐడి లేదా క్యూర్ ఆర్ కోడ్ తీసుకోని ఎరువుల దుకాణాలను సంప్రదించి కొనుగోలు చేసుకోవచ్చున్నారు. ఎరువు డీలర్లకు ప్రత్యేకంగా యాఫ్ లేదని పాయింట్ అఫ్ సేల్ (పీవోఎస్)మిషన్ లోనే క్యూఆర్ కోడ్ రీడర్, ఐడి నమోదు ఉంటుందని దాని ద్వారా రైతు వివరాలు బుక్ చేసుకున్న ఎరువులవివరాలు వస్తాయన్నారు. పీవోఎస్ లోనమోదు చేసిరైతులకు ఎరువులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. యాప్ పై అవగాహనకు వాలంటీర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. దీనిపై వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లకు శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, డైరక్టర్లు అడ్డగోఐ ఐలయ్య, సోసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, ఏఈవో బీ.నరేష్. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బానోత్ రాంమ్మూర్తి, మండల అధ్యక్షులుతోటకూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

- కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 05(జనసంఘర్షణ):



చర్ల: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగష్టు 9న చర్ల మండల కేంద్రంలో నిర్వహించనున్న కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చర్ల మండలంలోని ఆదివాసులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా చర్ల మండల ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచార రథం ద్వారా ఆగష్టు 9న జరగనున్న కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. కొమరం భీమ్ చూపిన జల్, జంగల్,జమీన్, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు ఆదివాసీ సమాజం ఐక్యంగా కదలాలని నాయకులు అన్నారు. ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఆగష్టు 9న చర్ల మండల కేంద్రంలో జరిగే కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆదివాసీ కుటుంబాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రచార రథం ను జెండా ఊపి ప్రారంభం చేసిన నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు ,ఆదివాసీ జేఏసీ నాయకులు వాసం ముసలయ్య, శ్యామల తరుణ్, తాటి రామకృష్ణ,ఇర్ప. ప్రకాష్, పూనెం. వరప్రసాద్,కారం. నరేష్, కాపుల కృష్ణ, పూజారి శ్రీకాంత్,కణితి. శ్రీను, యాలం రమేష్, పిలుపునిచ్చారు.జల్, జంగల్, జమీన్ మా హక్కు, కొమరం భీమ్ పోరాట స్ఫూర్తి వర్ధిల్లాలి, ఆదివాసీ ఐక్యతే మా బలం.

# ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ సాలె ఆశన్న హఠాత్ మృతి..

- జర్నలిస్టు లోకంలో విషాదం

కామారెడ్డి ప్రతినిధి/ఆగస్టు 5: /(జన సంఘర్షణ)

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జర్నలిస్టు వర్గాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తుతూ ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ సాలె ఆశన్న బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా కన్నుమూశారు. దాదాపు 25 సంవత్సరాలుగా పాత్రికేయ రంగంలో నిబద్ధతతో సేవలందించిన ఆశన్న మృతి పట్ల జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, నిజాంసాగర్ మండల కేంద్రం నుంచి తన స్వగ్రామం ఆరేడుకు కారులో వెళ్తున్న సమయంలో ఆశన్నకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఆయనను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**ప్రజల సమస్యలే ఆయన కలం దిశ....**

సాలె ఆశన్న గత 25 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో సీనియర్ రిపోర్టర్‌గా సేవలందిస్తూ నిజాంసాగర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి ప్రాంతాల ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చారు. రైతులు, పేదలు, సామాన్య ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారు. సహచరులతో స్నేహపూర్వకంగా, ప్రజలతో ఆప్యాయంగా మెలిగే వ్యక్తిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

**టీయూడబ్ల్యూజే - ఐజేయూ తీవ్ర సంతాపం :**

సాలె ఆశన్న మృతి పట్ల తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) కామారెడ్డి జిల్లా కార్యవర్గం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లతీఫ్, అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు వేణుగోపాల్ చారి, ఎస్.కె. మొహియొద్దీన్, చంద్రశేఖర్, శశికుమార్, సయ్యద్ కౌసర్ అలీ, ఆబిద్, ఆంధ్రజ్యోతి కామారెడ్డి స్టాఫ్ రిపోర్టర్ ప్రశాంత్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి సుధాకర్ గౌడ్ తదితరులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ.. "ఆశన్న ప్రజల కోసం నిరంతరం పనిచేసిన నిజాయితీ గల పాత్రికేయుడు. ఆయన మరణం జర్నలిస్టు రంగానికి తీరని లోటు" అని పేర్కొన్నారు.

**కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందించాలని విజ్ఞప్తి :**

మృతుడి కుటుంబానికి జర్నలిస్టు సంక్షేమ పథకాల కింద అందాల్సిన అన్ని ప్రభుత్వ ప్రయోజనాలు, ఆర్థిక సహాయం వెంటనే అందించాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆశన్న కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సాలె ఆశన్న మృతి జర్నలిస్టు ప్రపంచానికే కాకుండా ప్రజా సమస్యల కోసం కలం పట్టిన ఒక నిబద్ధత గల స్వరాన్ని కోల్పోయిన విషాద ఘటనగా సహచర పాత్రికేయులు అభివర్ణిస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ పలువురు నివాళులర్పించారు.










Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co